www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 29 సెప్టెంబర్ 2024
5
చిత్తూరు



బదిలీ చేస్తే మాకేంటి..?

శ్రీకాళహస్తి ఆలయ ఉద్యోగుల తీరు
100 రోజులైనా పట్టించుకోని 'కూటమి'



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు ఉద్యోగులపై బదిలీ వేటు పడింది. మరికొంతమందిపైనా బదిలీ వేటు తప్పదన్న సంకేతాలు వస్తున్నాయి. అయితే బదిలీల విషయం అంటుంచితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు 'బదిలీ చేస్తే మాకేంటి' అన్న పంథాలో వారి తీరు ఉంది. ఉన్న చోట పని చేయరన్న విమర్శలు ఏళ్ల తరబడి వినిపిస్తూనే ఉన్నాయి. తమ పలుకుబడి వినియోగించి ఆదాయ మార్గాలు అధికంగా వచ్చే చోట విధులు నిర్వర్తిస్తున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు. దీంతో తమను బదిలీ చేసినా తమకేం భయం లేదన్న ధోరణిలో కొందరు ఉద్యోగుల తీరు కనిపిస్తోంది.

ఉదాహరణకు శ్రీకాళహస్తీశ్వరాలయంలో 35 మంది వేద పండితులు, 36 మంది అర్చకులు, 25 మంది పరిచారకులు స్వామి అమ్మవార్లకు నిత్య సేవలు చేస్తూ ఉన్నారు. వీరిలో వేద పండితులు వేదమంత్రాలను, అర్చకులు స్వామి అమ్మవార్లకు, పరివార దేవతలకునిత్య కైంకర్యాలు చేయాల్సి ఉంటుంది. పరిచారకులు వీరికి సహాయకులుగా మాత్రమే వ్యవహరించాల్సి ఉంటుంది. అయితే పరిచారకుల్లో కొందరు అర్చకుల అవతారమెత్తి రాహు-కేతు మండపాల వద్ద, పరివార దేవతల ముంగిట హారతి పళ్లాలు పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా పరిచారకుల విధి ప్రసాదాల పోటులో సహాయకులుగా, పర్యవేక్షకులుగా ఉండడం. అయితే ప్రసాదాల పోటును మరిచి ఆలయం లోపలే కొంతమంది పరిచారకులు ఎక్కువసేపు గడుపుతున్నట్లు సమాచారం. దీంతో ప్రసాదాల నాణ్యత దెబ్బతింటుందన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే తిరుపతి లడ్డు నాణ్యత పై తీవ్ర దుమారం రేగుతున్న సంగతి తెలిసిందే. ఆ ఆరోపణలు ముక్కంటికి పాకాయి. ఈ క్రమంలో మరింత బాధ్యతగా పరిచారకులు వ్యవహరించాల్సి ఉంది.

గత వైసిపి పాలనలో శ్రీకాళహస్తి ఆలయం భ్రష్టు పట్టిందన్న ఆరోపణలు వచ్చాయి. అన్ని విధాలుగా అవినీతి అక్రమాలు జరిగాయనీ, దళారులు రాజ్యమేలినట్లు కూటమి నేతలు ఆరోపణలు చేశారు. ఎన్నికల తర్వాత తాము అధికారంలోకి వస్తాం..విచారణ చేయిస్తాం... బాధ్యులపై చర్యలు తీసుకుంటామని గొప్పలు పోయారు. అయితే అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా అవినీతి అక్రమాలపై కనీసం ప్రాథమిక విచారణ కూడా జరగలేదు. ఎవరిపై ఎటువంటి చర్యలు లేవు. ఆలయంలో ముఖ్యమైన ఇద్దరు అధికారులు బదిలీ అయ్యారు. ఒకరు ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారి కాగా, మరొకరు ఆలయ పరిపాలన అధికారి. ఇంకొందరు కింది స్థాయి ఉద్యోగులు. గత ప్రభుత్వ హయాంలో టెండర్లు, కొటేషన్లు, అంచనాలు లేకుండా ఇష్టం వచ్చిన విధంగా పనులు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువ పనులు ఒకే కాంట్రాక్టర్ ద్వారా చేయించారన్న విమర్శ ఉంది. అనాటి నాయకులకు బాగా "సాయం" చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అదేవిధంగా మరో అధికారి కలెక్షన్ కింగ్‌గా వ్యవహరించారు.

ఆలయంలో అయ్యవార్ల వద్ద వసూలు చేయడంలో ఆయన దిట్ట. జరిగిన వసూళ్లలో నాయకులకు వాటాలు ఇవ్వడంలో ఆరితేరిన వ్యక్తి. అయితే కొత్త ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటినా ఎవరిపైనా ఎటువంటి విచారణలు జరగకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటే ఇతరులు జాగ్రత్త పడతారు. మరోసారి అటువంటి అవకతవకలకు అవకాశం ఉండదు. అయితే ఆ దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. 'దొందూ.. దొందేనని' జనాలు అనుకుంటుండటం గమనార్హం.

3 నుంచి టెట్ కంప్యూటర్ బేస్డ్‌టెస్ట్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వచ్చే నెల 3 నుండీ 21వ తేదీ వరకు కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ 2024 జూలై టీచర్ ఎజ్జిబూల్టీటెస్ట్ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో టెట్ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం జిల్లాలో నాలుగు కేంద్రాలు, తమిళనాడు రాష్ట్ర చెన్నైలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 9.30 నుండీ 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుండీ 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాలుగా శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల బెంగుళూరు-తిరుపతి బైపాస్‌రోడ్డు, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల చిత్తూరు, వేమూ ఇంజనీరింగ్ కళాశాల కొత్తకోట పాకాల, మథర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాల పలమనేరు, ప్రజ్ఞ ఇంజనీరింగ్ కళశాల చెన్నైలో నిర్వహించనున్నారు. అక్టోబర్ 3వ తేదీ తెలుగు, తమిళ్, ఉర్దూ, 4 తెలుగు పేపర్ టూ (ఇంగ్లీష్ ల్యాగేజ్) 5 హిందీ (ల్యాగేజ్), 6 ఎస్‌జీటి పేవర్ వన్‌ఏ, పేపర్ బి, 7 ఎస్‌జీటి వన్‌ఏ, 8 ఎస్‌జిటి పేపర్ వన్‌ఏ, 9 ఎస్‌జీటి పేవర్ వన్‌ఏ, 10 ఎస్‌జీటి పేవర్ వన్‌ఏ, 13 ఎస్‌జీటి పేపర్ వన్‌ఏ, 14 ఎస్‌జీటి వన్‌ఏ తెలుగు, మేథామెటిక్స్ అండ్ సైన్సు, 15 పేవర్ 2ఏ మేథామెటిక్స్ అండ్ సైన్సు 16 పేవర్ 2ఏ మేథామెటిక్స్ అండ్ సైన్సు (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, తమిళ్, ఒరియా) 17 పేవర్ 2ఏ మేథామెటిక్స్ అండ్ సైన్సు, 18 పేవర్ 2ఏ మేథామెటిక్స్ అండ్ సైన్స, 19 2ఏ సోషియల్ స్టడీస్, 20 ల్యాగేజస్ పేపర్ 2ఏ సోషియల్ స్టడీస్, 21 పేపర్ టూఏ సోషియల్ స్టడీస్ అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని, ఏదైనా సందేహాలు, సమస్యలు ఉంటే 90321 85001 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఖైదీల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలి
సబ్ జైల్ తనిఖీ చేసిన ఎస్పీ



సబ్‌జైల్‌లోని ఖైదీలతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు జిల్లా సబ్ ను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు శనివారం తనిఖీ చేశారు. జిల్లా జైలు భద్రతా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో జైలు సిబ్బంది, అధికారులతో సబ్ జైలు భద్రత, ఖైదీల హక్కులు, జైలు సిబ్బంది పనితీరు, ఆర్థిక, భద్రతా అంశాలపై సమీక్షించారు. జైలు వ్యవస్థ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగమని, ఖైదీల భద్రతకు సంబంధించి ప్రభుత్వం, పోలీస్‌శాఖ, జైలు సిబ్బంది ఎంతటి కట్టుబాటు ఉందో వివరించారు. ఖైదీలకు సురక్షితమైన, నైతిక పరిరక్షణను కల్పించడంలో జైలు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలన్నారు. జైలులో ఉన్న సీసీటీవీ కెమెరాలు, గార్డులు చేపడుతున్న పర్యవేక్షణ, రాత్రి వేళల రక్షణా చర్యలపై విస్తృతంగా చర్చించారు. జైలులో గార్డులు, సిబ్బంది విధి నిర్వహణలో మరింత శ్రద్ధ చూపి, జైలు వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు మార్గదర్శకాలు అందించారు. ఖైదీల మనోభావాలు, వారి సమస్యలు, ఆరోగ్య పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, జైలర్లు శంకర రావు, అప్పలనారాయణ, కుమారస్వామి సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

హైకోర్టు జడ్జి కృష్ణమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి కృష్ణమోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: త్వరితగతిన పెండింగ్ కేసులను పరిష్కరించాలని హైకోర్టు జడ్జి కృష్ణమోహన్ సూచించారు. శనివారం స్థానిక జిల్లా కోర్టులో న్యాయమూర్తుల వర్క్‌షాపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు జడ్జి జిల్లాలో పెడింగ్ కేసులపై చర్చించి పరిష్కరించాలని సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాపులో ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులు పాల్గొన్నారు. రిటైర్డ్ జడ్జిలు అన్వర్‌భాషా, రాటకొండ మురళి న్యాయమూర్తులకు కేసుల పరిష్కారంలో తీసుకోవాల్సిన అంశాలను వివరించారు.

ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలి

పవర్లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు



ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగిరి ప్రాంతంలో జరుగుతున్న ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు శనివారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కూడా ధరణి ఊరి దగ్గర ఇసుక అక్రమ రవాణాను ప్రజలు అడ్డుకున్న సందర్భంగా వారిపై దౌర్జన్యం చేశారని, ఈ ఘటన పై జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అయినా ఇసుక అక్రమ రవాణా ఆగకుండా నిరంతరం కొనసాగుతూనే ఉందని అన్నారు. ఇసుకను అక్రమంగా తరలించడం వలన చుట్టుపక్కల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా వేలాది మంది పవర్లూమ్ కార్మికులు గతంలో పెద్దఎత్తున పోరాటం చేసిన ఫలితంగా కూలి రేట్లు పెంచినా అది ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే పోరాట శిబిరం వద్దకు వచ్చి తాము వచ్చిన వెంటనే కూలి రేట్లు పెంచుతామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వందరోజుల పూర్తవుతున్నా ఇప్పటివరకు దీని ఊసే లేదని అన్నారు. అంతేకాకుండా నగరి ప్రాంతంలో ఉన్న ప్రజాసమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలు చేస్తామని తెలిపారు. సమావేశంలో సిపిఎం నాయకులు పెరుమాళ్, తంగరాజు, మైల్‌స్వామి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.


ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం: తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. శనివారం ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో పలు కేసులపై వివరాలు అడిగి, రికార్డులు పరిశీలించారు. ప్రతి మహిళా పోలీసు వారి సచివాలయంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. సారా, గ్రానైట్స్, ఇసుక, ఎర్రచందనం పలు అక్రమ రవాణాల పైన ఎల్లప్పుడు నిఘా ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్ రికార్డులన్నీ సక్రమంగా ఉండడంతో ఎస్సై సుమన్, సిబ్బందిని అభినందించారు. చిత్తూరు డిఎస్పి సాయినాథ్, సిఐ హనుమంతప్ప, ఎస్సై సుమన్, ఏఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'మొగిలి' ప్రమాదాల నివారణకు చర్యలు

డేంజర్ జోన్ హోర్డింగులు ఏర్పాటు: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణకు చేపట్టే చర్యలను వచ్చే వారంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జాతీయ రహదారులు, రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన ముందస్తు చర్యలపై జాతీయ రహదారులు, రవాణాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చేపట్టే పనులను వారంలోపు పూర్తి చేయాలన్నారు. మొగిలి ఘాట్ వద్ద చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేసి ఒక అంబులెన్స్, క్రేన్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ ప్రాంతం డేంజర్ జోన్‌గా వాహనదారులకు తెలిసేందుకు 200 మీటర్లకు ఒకచోట వివిధ బాషలలో హోర్డింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీనితోపాటు పెట్రోలింగ్ వెహికల్‌ను అందుబాటులో ఉంచాలని పటిష్టంగా బ్యారికేడింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. దీనితో పాటు సైన్ బోర్డుల ఏర్పాటు ముఖ్యమన్నారు. ధర్మ ప్లాస్టిక్, డ్రమ్స్ స్టిక్కర్స్, బీటీరంబ్లిక్ ఏర్పాటు చేయాలన్నారు. అతి వేగం నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌పోర్ట్ అధికారులను ఆదేశించారు. చేపడుతున్న ముందస్తు పనులను వచ్చే వారంలోపు పూర్తి చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్‌పిడి వెంకటేశ్వర్లు, డిటిసి నిరంజన్ రెడ్డి, పిఆర్ ఎస్ఈ శంకరనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన అవసరం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జంతువుల నుండి సక్రమించే రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఈ వ్యాధి సోకకుండా పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలను వేయించాలని డిఎం అండ్ హెచ్ ఓ ప్రభావతి దేవి సూచించారు. శనివారం రెబిస్ వ్యాధి టీకాను కనుగొన్న లూయిస్ జయంతి సందర్భంగా స్థానిక దర్గా సర్కిల్‌లో రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ ఓ మాట్లాడుతూ 'రేబీస్ సరిహద్దులను బద్దలు చేయడం'పై అవగాహన కార్యక్రమాలు జరపాలన్నారు. రేబిస్ అనే వ్యాధి ప్రాణాంతకమని కుక్క, ఇతర జంతువులు కరిచిన వెంటనే వ్యాక్సిన్ తప్పనిసరిగా పూర్తి డోస్ వేసుకున్నట్లయితే ఎలాంటి భయం లేదని అన్నారు. పెంపుడు జంతువులకు తప్పనిసరిగా ముందస్తు వాక్సినేషన్ వేయించాలని, ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్, జెడి వెటర్నరీ డాక్టర్ ప్రభాకర్, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఐడి ఎస్‌పి నోడల్ అధికారి డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శిరీష, శ్రీవాణి పాల్గొన్నారు.

విజయపురం: జాతీయ కుక్క కాటు దినోత్సవంలో భాగంగా విజయపురం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కుక్క కాటుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కుక్క కరిచిన వెంటనే గాయపడిన చోట సబ్బుతో శుభ్రం చేసుకుని, స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో సూది వేసుకోవాలని సూచించారు. కుక్క కాటును నిర్లక్ష్యం చేస్తే రాబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని, అది మరింత ముదిరితే ప్రాణాపాయ పరిస్థితి ఉంటుందని దీన్ని ప్రజలు గ్రహించి సూది వేసుకోవాలని సూచించారు.

100 రోజులు పూర్తయ్యింది సరే..
సమస్యల పరిష్కారం ఎప్పుడు..?

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులకు వినతుల వెల్లువ పారింది. అనేక సమస్యలను ప్రజలు నాయకుల దృష్టికి తీసుకెచ్చారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల ద్వారా సమస్యలను మాత్రం గుర్తించారే కానీ వాటిని ఎప్పుడు పరిష్కరిస్తారనే హామీలు ఇవ్వకపోవడం గమనార్హం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సరిగ్గా 100 రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా ఈ నెల 20 నుంచి 27వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో బాగంగా తిరుపతి జిల్లాలోనూ ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల వద్దకెళ్లి ప్రజావేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. అభివృద్ధి, సంక్షేమం ఒకే పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని ఉద్దేశంతో, ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ప్రజావేదిక లక్ష్యం. పట్టణ ప్రాంతాల్లో మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో తిరుపతి నగరంలో కూటమికి చెందిన జనసేన, టిడిపి, బిజెపి, నాయకులు అన్ని డివిజన్లలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ నెల 20వ తేదిన తిరుపతి జీవకోనలో ప్రారంభమైన ఈ కార్యక్రమం నగరంలోని 50 డివిజన్లలో పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ నెల 27వ తేదిన ఎంఆర్ పల్లి వద్ద జరిగిన చివరి సభతో ఈ కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా నగరంలో పలు సమస్యలను స్థానిక ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం కావడంతో టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో పాటు వైసిపికి చెందిన తిరుపతి ఎంపి డాక్టరు మద్దిల గురుమూర్తి, జనసేనకు చెందిన తిరుపతి ఎంఎల్ఏ అరణి శ్రీనివాసులు, వైసిపికి చెందిన ఎంఎల్‌సి డాక్టరు సిపాయి సుబ్రమణ్యం, వైసిపికి చెందిన నగర మేయరు డాక్టరు శిరీషా సభలకు హాజరయ్యారు. జిల్లా కేంద్రం కావడంతో జిల్లా కలెక్టరు, ఎస్‌పి, జాయింట్ కలెక్టర్, డిఎంహెచ్‌వో, అన్ని విభాగాల జిల్లా అధికారులు కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. జీవకోన ,రాజీవ్‌గాంధీ ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపుల కొన్ని వీధుల్లో మురికికాల్వలు లేవని, వీధి దీపాలు వెలగడం లేదని, పారిశుధ్యం మెరుగుపరచాలని, కొన్ని ప్రాంతాలకు అపుడపుడు తప్ప మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, పలు చోట్ల ఆకతాయిల ఆగడాలు వల్ల మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని ప్రాంతాల్లో సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని, కొన్ని ప్రాంతాల్లో యుడిఎస్ ఏర్పాటు చేసి, కనెక్షన్లు ఇవ్వాలని, దోమలు బెడద ఎక్కువుగా ఉందని, ఆరోగ్య సమస్యలు, స్థానిక స్కూళ్లలో భద్రత చర్యలు తదితర సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముగింపు రోజు స్థానికులు నిలదీయడం, మీడియా ప్రశ్నించడంతో అధికారులు తూతూ మంత్రంగా సమాధానం ఇచ్చారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

కమిషనర్ పి.నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వర్షాలు నేపథ్యంలో నగరపాలక ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు నిల్వచేరకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎమ్మెస్సార్ కూడలిలో డ్రైనేజీలను పరిశీలించారు. డ్రైనేజీలో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, వర్షాలు పడిన సమయంలో నీటి ప్రవాహానికి అడ్డం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మామిడికాయల మార్కెట్ యార్డ్ వద్ద కల్వర్టర్‌ను పరిశీలించారు. కల్వర్టర్‌లో నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి వ్యర్థాలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు నేపథ్యంలో కాలువల్లో, లోతట్టు ప్రాంతాల వద్ద నీరు నిల్వచేరకుండా వేగంగా వెళ్లేలా పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలన్నారు. కమిషనర్ వెంట అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



నగరంలోని లోతట్టు ప్రాంతాల కాలువలను పరిశీలిస్తున్న నగర కమిషనర్

ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు



పలమనేరులో నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలమనేరు: భగత్ సింగ్ జయంతి వేడుకలను పలమనేరు సిఐటియు ఆఫీసులో సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్ రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అన్నూరు ఈశ్వర్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులకు ఎదురు నిలిచిన స్వాతంత్ర్య పోరాటంలో వీర మరణం పొందిన యోధులలో భగత్ సింగ్ ప్రథముడని అన్నారు. భగత్ సింగ్ దృష్టిలో విప్లవం అంటే ప్రజల ద్వారా, ప్రజల కోసం రాజకీయ అధికారాన్ని సాధించడమే అన్నారు. లక్ష్మయ్య, పద్మమ్మ, ఎల్లప్ప పాల్గొన్నారు.

కార్వేటినగరం: బ్రిటిష్ వారికి భారత యువరక్తం వేడి రుచి చూపిన వీరుడు భగత్ సింగ్ అని డీఎం.పురం హెచ్‌ఎం కేశవులు పేర్కొన్నారు. శనివారం భగత్ సింగ్ 118వ జయంతి ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ విప్లవ పోరాట విశేషాలను సీనియర్ సోషల్ ఉపాధ్యాయిని హరిత విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు సరస్వతి, హరిత, మాలతి, సుమతీ, తిరుమలరాజు, సుబ్రమణ్యాం రెడ్డి, చిన్నయ్య శెట్టి, వెంకట రమణయ్య, డిల్లిబాబు, రాములు, రంజిత్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'హె సిరి అలా వెళ్ళకే' ట్రైలర్ విడుదల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రేమ వయస్సుకు సంబంధించి కాదని, మనస్సుకు సంబంధించిదనే కథాంశంతో తెరకెక్కుతున్న హె సిరి అలా వెళ్ళకే వెబ్ సీరిస్ చిత్రం ట్రైలర్ను శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో చిత్ర యూనిట్ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత షీలా లోకనాథమ్ మాట్లాడుతూ 33 నిముషాల నిడివితో మూడు భాగాలుగా ఈ వెబ్ సీరిస్ చిత్రాన్ని తిరుపతి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించామన్నారు. ఇప్పటికి ఒక బాగం పుర్తయిందన్నారు. చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ తిరుపతిలో ఎంతో మంది మంచి కళాకారులు ఉన్నారని, వారికి తగిన ప్రోత్సాహకం ప్రభుత్వం అందించి గుర్తింపు కార్డులను మంజూరు చేయ్యాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో చిత్ర దర్శకుడు, కెమెరామెన్ కిరణ్ క్రిస్టోఫర్, కథా నాయకుడు సాయినాథ్, కథా రచయిత భరత్, మౌనిక, కామెడీ, శాస్త్రీ, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలి


గంగాధర నెల్లూరులో..

కమిషనర్ మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు

గత ప్రభుత్వంలో మంజూరైన గృహనిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక బైపాస్ రోడ్ జగనన్న కాలనీలో 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పిఎంఎవై ఫేస్ వన్ కింద మంజూరైన గృహాలు అన్నింటిని డిసెంబర్ 24వ తేదీ లోపు లబ్ధిదారులందరూ పూర్తి చేసుకోవాలని సూచించారు. అలా చేసుకోకుంటే ప్రభుత్వం నుంచి రావలసిన రాయితీని నిలుపుదల చేస్తారని చెప్పారు. 2025 గృహ నిర్మాణం పూర్తి చేయాలంటే వారి సొంత నిధులుపెట్టి చేసుకోవలసి వస్తుందన్నారు. హౌసింగ్ ఏఈ హేమంత్ కుమార్, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ కేశవాచారి, టిడిపి నేతలు శ్రీకాంత్, సివి రెడ్డి, పోలీస్ గిరి పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం పంచాయతీ పద్మసరస్సు సమీప వద్ద ఉన్న జగనన్న లేఅవుట్‌లో అసంపూర్తిగా ఉన్న హౌసింగ్ ఇళ్లను పూర్తిచేయాలని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మనాభం లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. శనివారం కాలనీలోని జగనన్న ఇళ్లను పరిశీలించారు. పిడి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేస్తే వెంటనే బిల్లు మంజూరు చేస్తామన్నారు. ఇటీవల కలెక్టర్ సుమిత్ కుమార్ సందర్శించడం జరిగిందని కావున అసంపూర్తిగా ఉన్న ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని కోరారు. సర్పంచ్ ధనంజయ వర్మ, ఇంచార్జి ఎంపీడీవో లక్ష్మి పతి, ఈవో మణి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను శనివారం ఇన్చార్జ్ ఎంపీడీవో హరినాథ్ బాబు పరిశీలించారు. గృహలబ్ధిదారులందరూ వందరోజుల్లో పెండింగ్ ఉన్న ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పచ్చికాపల్లం లేఅవుట్ లోని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. లేఅవుట్‌లో గృహనిర్మాణాలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా, విద్యుత్ వంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. మండల ప్రత్యేకాధికారి రూపసుందరి, హౌసింగ్ ఏఈ పృధ్వీ, పంచాయతీ కార్యదర్శి మోహన్, సర్పంచ్ పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: అసంపూర్తిగా ఉన్న ఇళ్ళను నూరు రోజుల్లో పూర్తి చేయాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగరత్నమ్మ, నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ పార్లమెంటు టీన్ టీయుసీ అధికార ప్రతినిధి జీవరత్నం కోరారు. మండలం తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో పలువురు ఇళ్ళ లబ్దిదారులతో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీటీసీ వాణిశ్రీ కేశవులు, పంచాయతీ కార్యదర్శి మురళి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యువరాజ్, టిడిపి నాయకులు కండిగ శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ కరుణ పాల్గొన్నారు.


కార్వేటినగరంలో..

రెండవ రోజు సోమల నుంచి పాదయాత్ర


పాదయాత్రలో రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి- సోమల, సదుం: బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ శుక్రవారం ప్రారంభించిన తిరుమల పరిరక్షణ పాదయాత్ర రాత్రి సోమల సమీపంలోని అభయ ఆంజనేయ స్వామి వద్దకు చేరుకుంది. శనివారం ఉదయం 8 గంటలకు ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రామచంద్ర యాదవ్ ఆయన అనుచరులు మహిళా భక్తులు అందరు కలిసి తిరిగి తిరుమల పాదయాత్రను ప్రారంభించారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు చేయాల్సిన 7 సూచనలను దేవస్థానం వారికి తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. అక్కడి నుంచి సదుం మండలానికి పాదయాత్ర చేరుకుంది.

గుడి నిర్మాణానికి రూ.50వేలు విరాళం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ఎం కొత్తూరు గ్రామంలో గ్రామపెద్దలు రాజగోపాల్, నాగరాజు, శ్రీనివాసులు, గోపాలప్ప, చంద్రప్ప నూతనంగా నిర్మిస్తున్న నడిమీది గంగమ్మ దేవాలయంకు కర్ణాటక రాష్ట్రం సినిగినపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ రెడ్డి రూ.50వేలు నగదును విరాళం అందజేశారు. శనివారం ఆయన గుడి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామపెద్దలు ప్రకాష్ రెడ్డిని పూలమాల, శాలువాతో సత్కరించారు.

రూ.25వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి- సోమల: మండలంలోని చింపిరెడ్డిపల్లి గవర్నమెంట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయుడు గురువారం గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. విదేశాలలో ఉన్న మృతుడి పిల్లలు శుక్రవారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకోగా శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు హాజరైన ఎంఈఓలు శ్రీరాములు, శివశర్మమ్మ మృతుడి అంత్యక్రియల కోసం ప్రభుత్వం తరపున రూ.25వేల నగదును అందజేసి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో మండల విద్యా వనరుల కేంద్ర సిబ్బంది, యుటిఎఫ్, ఎస్టీయు నాయకులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: జిల్లా యునిసెఫ్ అధికారి డాక్టర్ హనుమంతరావు శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న నాగిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యాక్సిన్ మెయింటెనెన్స్, ఐఎల్ఆర్, డీప్ ఫ్రీజర్, డ్యూలిస్టు, రికార్డ్ వెరిఫై చేసి ఆరోగ్య సిబ్బందికి తగు సలహాలు ఇచ్చారు. డాక్టర్ విజయచందర్, సీహెచ్ఓ అనురాధ, ఫార్మసిస్ట్ సారామతి, సూపర్వైజర్ గోపి, ఎంఎల్‌హెచ్‌పి మాధవి, ఏఎన్ఎం సరస్వతి, ఆశాలు నాగవేణి, చిన్నమ్మ పాల్గొన్నారు


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ హనుమంతరావు

జిల్లా స్థాయి పోటీలకు

డీకే చెరువు విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: జిల్లా స్థాయి పోటీలకు డీకే చెరువు ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించారు. మండల పరిధిలో స్వర్ణాంధ్రప్రదేశ్ అన్న అంశంపై మండల స్థాయిలో డీకే చెరువు ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో 10వ తరగతి చెందిన విద్యార్థిని భూమిక, వక్తృత్వ పోటీల్లో హేమలేఖ, స్నేహ, డిబేట్లో పాల్గొని మండల స్థాయిలో ముగ్గురు విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుపొందారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

'దంత సంరక్షణతో ఆరోగ్యం'



ప్రజాశక్తి- సోమల: రోజుకు రెండుసార్లు దంత దావన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చునని సోమల ప్రాథమిక కేంద్ర దంత వైద్యులు శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని చిగుళ్ళ నాలుక మీద కూడా శుభ్రం చేసుకోవడం ద్వారా నోటిలోని బాక్టీరియాలు తొలగించుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్యుల వద్దకు వెళ్లి దంతాలను పరీక్ష చేయించుకోవాలని దీని ద్వారా పుచ్చిన కదులుతున్న దంతాలను గుర్తించి ప్రారంభ దశలోనే సరైన వైద్యం తీసుకోవచ్చునని అన్నారు. సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి శనివారం అందుబాటులో ఉంటానని ఎవరైనా దంత సమస్యలు కలిగిన వారు వచ్చి పరీక్ష చేయించుకోవచ్చునని అన్నారు.

కుప్పంలో 'స్వచ్ఛతాహీ సేవ'



ప్రజాశక్తి- కుప్పం రూరల్: మండలంలోని నడుమూరు గ్రామపరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు, కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు కలిసి స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంగణాలను శుభ్రం చేయడంతోపాటు చెట్లు నాటి వాటిని పరిరక్షించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: విద్యార్థులు ఉత్తమ సంఘ సేవకులుగా ఎదగాలని హాకింగ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అధ్యక్షులు హబీబ్ పిలుపునిచ్చారు. వరద బాధితుల సహాయార్థం తమ పాఠశాల విద్యార్థులు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. తమ పాఠశాల విద్యార్థులు చందాలు వేసుకుని రూ.54,900లను వరద బాధితుల సహాయార్థం అందించినట్లు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్‌గా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- పలమనేరు



పలమనేరు నూతన సబ్ రిజిస్ట్రార్‌గా సుబ్రహ్మణ్యం శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పలమనేరు రిజిస్ట్రార్‌గా ఉన్న పద్మశేఖర్ రెడ్డి బదిలీపై చిన్నగొట్టిగల్లుకు వెళ్లారు.

ఆర్డీవోకు ఆత్మీయ వీడ్కోలు



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్డీవోగా పని చేసిన మనోజ్ రెడ్డికి శనివారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు తెలిపారు. ఆర్‌డిఓ మనోజ్ రెడ్డి కడప జిల్లా మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళుతున్నారు. సమావేశంలో మనోజ్ రెడ్డి సేవలను మున్సిపల్ కమిషనర్, వివిధ మండల తహశీల్దార్లు, సిబ్బంది కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు.

మండల సర్వేయర్‌గా సునీత

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు:



మండల సర్వేయర్‌గా సునీత బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆమె చిత్తూరు మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మండల సర్వేయర్ గణేష్ గుడిపాల మండలానికి బదిలీపై వెళ్లారు.

డిటిగా మోహన్ రాజ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు:



గంగాధర నెల్లూరు ఎన్నికల డిప్యూటీ తహశీల్దారుగా మోహన్‌రాజ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఈయన కలెక్టరేట్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ డిప్యూటీ తహశీల్దారుగా పనిచేస్తున్న విజయకృష్ణ చిత్తూరు రూరల్ మండలం తహశీల్దార్ ఆఫీస్‌కు డీటీగా బదిలీ అయ్యారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీకి

శ్రీ వివేకానంద విద్యార్థి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తిరుపతిలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీలో చిత్తూరు కొంగారెడ్డిపల్లిలోని శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల ఇంటర్ సిఈసి మొదటి సంవత్సరం చదువుతున్న హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు శ్రీ వివేకానంద కరెస్పాండెంట్లు మహేంద్రకుమార్, భాస్కర్ నాయుడు శనివారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యతో పాటు క్రీడారంగాల్లో ఆసక్తిని కనబరిచే విద్యార్థులకు తమ ప్రోత్సహం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

దేవాలయాలలో వైసీపీ శ్రేణుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- సోమల


బంగారుపాళ్యంలో..

తిరుమల శ్రీవారి ప్రసాదం అయిన లడ్డులో కల్తీ చేశారన్న ఆరోపణల నేపథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు మండలంలోని పలు వైష్ణవాలయాలలో వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమల, ఉప్పరపల్లిలోని రామాలయం, వైష్ణవాలయాలలో పూజలు నిర్వహించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర్, శ్రీరాములు, రాజారెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ముఖ్యమంత్రి చంద్రబాబుమత విద్యాసాలను రెచ్చగొడుతున్నారని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మొగిలి వెంకటగిరిలోగల శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమార్ రాజా, రామచంద్రారెడ్డి, శిరీష్ రెడ్డి, సోమశేఖర్, తులసి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల కేంద్రమైన చవటగుంట మహాభారతం ఆలయంలో శనివారం వైయస్సార్ కాంగ్రెసు పార్టీ మండల పార్టీ అధ్యక్షులు కామసాని పద్మావరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగాధర నెల్లూరు: శనివారం గంగాధరనెల్లూరు అల్లిఎల్లమ్మ ఆలయం వద్ద వైసీపీ కార్యకర్తలు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముని రాజారెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, హరిబాబు, వెంకటరెడ్డి, చిన్నమ్మ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఏకాంబరం, గోవింద్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్: తిరుమల లడ్డు పవిత్రతపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దురుద్దేశ పూరిత ఆరోపణలు చేయడం సరికాదని చిత్తూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ విజయానందరెడ్డి అన్నారు. కట్టమంచిలోని శ్రీదేవి భూదేవి సమేత వరదరాజుల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుడా మాజీ ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, నగర డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, గాయత్రీ దేవి, హరిణిరెడ్డి పాల్గొన్నారు.

కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుంది

ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

ప్రజాశక్తి- కుప్పం టౌన్

తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం తెలిపారు. శనివారం కుప్పం ఎన్టీఆర్ భవన్లో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కుప్పం నియోజకవర్గంలో ఎంతో మంది కార్యకర్తలు, నాయకులు గత ఐదు సంవత్సరాలలో ఎన్నో ఇబ్బందులు పడ్డారని, కుప్పంలో గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో అందరూ ఒక యుద్ధం లా పోరాడారని అన్నారు. కష్టపడిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించే విధంగా పార్టీ నాయకత్వం కృషి చేస్తుందని తెలిపారు.


పాత్రికేయ సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

జాతీయ రహదారిపై దళితుల నిరసన

ప్రజాశక్తి- కార్వేటినగరం, వెదురుకుప్పం:


మృతి చెందిన ఆవు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో సుశీలమ్మ జీవనాధారమైన రూ.లక్ష 40 వేలు విలువ చేసే పాడి ఆవును కోల్పోయిందని శనివారం కోట దళితవాడ గ్రామానికి చెందిన దళితులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమంలో నిర్వహించడంతో గంట పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పుత్తూరు విద్యుత్‌శాఖ డీఈతో ఫోన్ ద్వారా మాట్లాడి బాధితురాలను ఆదుకోవాలని, నిత్యం ప్రాణాపాయంగా ఉంటూ మూగజీవాలను బలిగొంటున్న ట్రాన్స్ ఫార్మర్ ఎత్తు పెంచి, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామాల్లో ఇళ్లపై ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించి ప్రమాదం లేని చోట ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన పుత్తూరు విద్యుత్‌శాఖ డీఈ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు నిరసన విరమించుకున్నారు. మరణించిన పాడి ఆవుకు పోలీసుల ఆధ్వర్యంలో పశు వైద్యాధికారి హేమ కుమార్ పోస్టుమార్టం నిర్వహించారు.


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

వీఆర్ ఏఈని నిలదీసిన సర్పంచులు

సమస్య పరిష్కారానికి కృషి చేస్తా: ఎంపీడీవో

ప్రజాశక్తి- విజయపురం

మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసగా ముగిసింది. ఎంపీడీవో చంద్రమౌళి ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ బాలాజీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో మండలానికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. వివిధ శాఖకు చెందిన అధికారులు గత ప్రభుత్వంలో జరిగిన ప్రస్తుత ప్రభుత్వంలో మంజూరైన నిధులపై వివరించారు. ముందుగా వ్యవసాయ అధికారి రజిని కుమారి మాట్లాడుతూ రవికి అవసరమైన ఎరువులు ఆర్‌బిఐ అందుబాటులో ఉన్నాయని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే మినీ డెయిరీ ఫార్మ్ ఏర్పాటు కోసం వెనుకబడిన కుటుంబానికి చెందినవారు దరఖాస్తు చేసుకోవాలని వెటర్నరీ సిబ్బంది తెలిపారు. టీబి అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యాక్సను వేయిస్తున్నాయని మండలంలో 8895 మంది షుగర్ బిపి వ్యాధితో బాధపడుతున్నారని వీరందరూ తప్పకుండా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉన్నందున జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరు స్థానిక విజయపురం హాస్పిటల్ రక్తపరీక్ష చేయించుకోవాలని దీని ద్వారా మలేరియా, డెంగీ, టైఫాయిడ్‌ను గుర్తించ వచ్చు అని తెలిపారు. పంచాయతీలో అంగన్వాడి కేంద్రం లేనిచోట నూతనంగా భవనం నిర్మిస్తున్నామని త్వరలో వాటిని కూడా పూర్తిచేసి అంగన్వాడి కేంద్రాలకు అప్పగిస్తామని ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి తెలిపారు.


రసాభాసగా సర్వసభ్య సమావేశం

వీఆర్ఏఈని నిలదీసిన సర్పంచులు


సర్వసభ్య సమావేశంలో ప్రశ్నిస్తున్న సర్పంచులు

గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా గత నెల పంచాయతీలలో ఎన్ఆర్‌జీఎస్ గ్రామసభలు నిర్వహించారు. అందులో గ్రామాభివృద్ధికి సంబంధించిన పనులను ప్రజలు తమ సర్పంచులు చేత సేకరించారు. దీని ఆధారంగా ఎనర్జీస్ నిధుల నుంచి సుమారు మండలానికి కోటి రూపాయలు మంజూరైందని, 25 పంచాయతీలులకు గాను 29 సిసి రోడ్లు గాను రూ.99.4లక్షలు మంజూరైనట్లు వీరభద్రం తెలిపారు. వెంటనే సర్పంచులు ద్వారా వచ్చిన నిధులను స్థానిక సర్పంచులకు తెలియకుండా అధికార పార్టీ నాయకులకు అప్పజెప్పడం సరికాదని అన్నారు. మీ అధికారం ఉన్నప్పుడు మీరు చేశారు.. ఇప్పుడు ఎవరు అధికారం ఉందో ఆ నాయకులు చేస్తారని ఆయన జవాబు చెప్పడంతో సర్పంచులు అందరూ మండిపడ్డారు. సర్పంచ్ లేక రిజర్వేషన్ లేకుండానే ఎనర్జీ ఎస్ పనులను టిడిపి నాయకులకు అప్పజెప్పడం సరికాదని దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన సభలో హెచ్చరించారు. ఇంతలో కొంత టిడిపికి చెందిన సర్పంచులు గవర్నమెంట్‌లో మేమే చేస్తాం అని చెప్పడంతో మాటల యుద్ధం కొనసాగింది. వెంటనే వైస్ ఎంపీపీ బాలాజీ జోక్యం చేసుకొని సమావేశం శాంతియుతంగా జరగాలని ప్రతి ఒక్కరు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చేస్తామని అన్నారు. ఐదేళ్లకొకసారి పార్టీలో మారుతుంటాయని, పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి చేసుకోవల్సిన బాధ్యత ప్రతి సర్పంచిదే అని సూచించారు. అనంతరం ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ సర్పంచులు, అధికారులు కలిసికట్టుగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎన్ఆర్జీఎస్ నిధులను సద్వినియోగం చేసుకొని అవసరమైన చోట సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ రమణ ప్రకాష్, ఈవోపీఆర్‌డి సురేంద్ర కుమార్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా



ప్రజాశక్తి- కుప్పం టౌన్: నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా అని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జింకా లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం గుర్రం జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ జాషువా లాంటి కవిని మార్గదర్శకంగా తీసుకొని సమాజ ఉద్ధరణ కోసం విద్యార్థులు సాహిత్యాన్ని అవగతం చేసుకొని, భవిష్యత్తులో మంచి కవులుగా, రచయితలుగా రాణించాలని ఆకాంక్షించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ నారాయణమూర్తి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఏ.చంద్రబాబు, అధ్యాపకులు ఐక్యు ఏసి కోఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ గొర్రెల నాగరాజు, డి.ఈశ్వరాచారి, సి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమ డీజల్, పెట్రోల్ విక్రయిస్తే చర్యలు

సిఐ శ్రీనివాసులు


దుకాణదారులతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అక్రమంగా డీజల్, పెట్రోల్ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం మండలంలోని జాతీయ రహదారి పక్కనున్న దుకాణదారులతో సమావేశం జరిగింది. సిఐ మాట్లాడుతూ వాహనాల్లోని డీజిల్, పెట్రోలు దొంగలించి తక్కువ ధరకు విక్రయిస్తున్నారని, వాటిని దుకాణదారులు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని దీనివలన ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని తెలిపారు. అక్రమంగా ఇంధనంను విక్రయించడం వలన ప్రమాదాలకు దారి తీస్తుందని, డ్రైవర్లు స్వల్ప లాభానికి ఆశ చూపి కొనుగోలు చేసి విక్రయించడం చట్టరీత్యా నేరమనారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కంప్యూటర్ కోర్సులపై గెస్ట్‌లెక్చర్



ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాల ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో ఫుల్ స్టాక్ ఆర్కిటెక్చర్ గెస్ట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద మాట్లాడుతూ నేటి సమాజంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, ఈ పోటీ ప్రపంచంలో ఉద్యోగావకాశాలు, ఉద్యోగాల కల్పనలో కంప్యూటర్ కోర్సుల పరిజ్ఞానం తప్పనిసరి అన్నారు. బెంగళూరుకు చెందిన కాం స్కోప్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రిన్సిపల్ సాఫ్ట్వేర్ ఇంజినీర్ మురళీ మోహన్ ఫుల్ స్టాక్ ఆర్కిటెక్చర్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. కంప్యూటర్ కోర్సు విభాగ అధిపతులు ఎస్‌కె. మున్వర్, వై.శ్రీనివాసులు కంప్యూటర్ టెక్నాలజీ కోర్సుల్లో వస్తున్న మార్పులు వివరించారు. ఐక్యుఎసి కోర్డినేటర్ డాక్టర్ పూడి వెంకటేష్, ప్లేస్ మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.శంకర్ రెడ్డి, వి.నాగేశ్వరరావు, డాక్టర్ భరణీనాథ్ రెడ్డి, అధ్యాపకులు ఎం.ఇస్మాయిల్, టి.నరేంద్ర బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి- సోమల: కళాశాలలో చదువుతున్న తమ పిల్లల భవిష్యత్తు, అభివృద్ధిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని నిరంతరం గమనిస్తూ వారి ఉన్నతికి మార్గాలు చూపాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు కోరారు. శనివారం కళాశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. దసరా సెలవుల అనంతరం విద్యార్థులకు మూడు నెలల పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరై పరీక్షలు బాగా రాసి పాస్ అవ్వాలని విద్యార్థులకు సూచించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులకు సేవాభావాన్ని కూడా నేర్పిస్తూ సమాజంలో పేద ప్రజలకు ఆపదలో ఉన్నవారికి ఏవిధంగా సేవ చేయాలి, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలన్న విషయాలను నేర్పిస్తున్నామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్ అన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకుండా స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో

సీడ్ బాల్స్ తయారీ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన రామసముద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులచే వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ తయారీ చేయించారు. ఈ సందర్భంగా సిఆర్పి ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తద్వారా గాలిలో కాలుష్యం తగ్గి సమాజంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత మాట్లాడుతూ ఖాళీ స్థలాలలో సీడ్ బాల్స్ వేయడం ద్వారా అవి వర్షాలకు మొలకెత్తి వృక్షాలుగా మారే అవకాశం ఉందని ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని అన్నారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పూర్ణిమ, సంధ్యారాణి, శిల్ప, హారిక, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి- కుప్పం రూరల్: సమాజంలో ప్రతిఒక్కరూ చట్టాల పై అవగాహన పెంచుకోవాలని కుప్పం తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు. కుప్పం మండలం మల్లనూరు గ్రామంలో శనివారం ఎమ్మార్పీఎస్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు ప్రకాష్, నియోజకవర్గ అధ్యక్షులు రాజకుమార్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. దళిత నాయకులు మాట్లాడుతూ స్థానికంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన అధికారులు వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మిట్టూరు నివాసి లావణ్య సహకారంతో శనివారం రెడ్ క్రాస్ కార్యాలయంలో క్షయవాధి వ్యాధిగ్రస్తులు ఏడుగురికి ఆరు రకాల పౌష్టికాహారం కిట్లు అందించడం జరిగిందని రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి సహదేవ నాయుడు తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధి నుండి త్వరగా కోలుకోవచ్చు అని జిల్లా క్షయవ్యాధి నివారణ వైద్యఅధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ తెలిపారు. ఈకార్యక్రమంలో రెడ్ క్రాస్ సిబ్బంది డాక్టర్ విజయకుమార్, గోపి, చిరంజీవి పాల్గొన్నారు.